# హంతకుడు

తాళ్లూరు నాగేశ్వరరావు

ఇంకా అరగంటకుగానీ పూర్తిగా తెల్లవారదు. అయితే తూర్పురేకలు విచ్చుకోలేదు. సూర్యుడిమీద కుట్ర పన్నిన కారుమబ్బులు కయ్యానికి కాలు దువ్వసాగాయి. వాటితో చల్లని గాలి చేతులు కలిపింది. సన్నటి వర్షం మొదలైంది.

'గుడ్ మార్నింగ్' ఇరానీ హోటల్ దగ్గర సైకిలు దిగి స్టాండ్‌వేశాడు పేపరుబాయ్ వాసు. పక్కన మరో నాలుగు సైకిళ్లు నిలబెట్టి వున్నాయి. సైకిలు కారియర్ మీదున్న పేపరు కట్టలనుంచి ఒక ఇంగ్లీషు పేపరూ, ఒక తెలుగు పేపరూ తీసుకొని హోటల్లోకి వెళ్లాడు వాసు. ఆ కుర్రాడికి పన్నెండేళ్లకంటె వుండవు. సన్నగా, పొడుగ్గా వున్నాడు. పల్చటి, కోలమొహం. ఆ మొహాన్ని మింగివేసే వొత్తుపాటి ఉంగరాల జుత్తు, తెల్లని ప్యాంట్‌పైన ఎర్రటి స్లాకు ధరించాడు.

“గుడ్ మార్నింగ్” అంటూ ఆ రెండు పేపర్లనూ క్యాష్‌టేబుల్‌ముందు ఎత్తుపాటి కుర్చీలో కూర్చున్న ప్రొప్రైటరు కిచ్చాడు వాసు.

క్యాష్‌టేబుల్ డిజైన్ చాల చక్కగా వుంది. వైట్ బ్యాక్‌గ్రౌండ్ మీద బ్లూ కలర్ దెకలాం చార్మినార్ బొమ్మల డిజైన్ అందంగా వుంది. క్యాష్‌టేబుల్ కుర్చీమీద కూర్చున్న హోటల్ ప్రొప్రైటర్ ఖురేషీ మరింత అందంగా వున్నాడు. వయస్సు నాలుగున్నర పదులుంటుంది. శరీరఛాయ తండూరీ చికెన్‌ను పోలింది. గద్దముక్కు, ఏనుగు కళ్లు, ఎత్తు ఆరడుగులకు పైన. ఆ ఎత్తును కనబడనీయకుండా వుండే స్థూలకాయం. పోకచక్క చెట్టు బోదెలాంటి మెడచుట్టూ లాకెట్‌తో బంగారు గొలుసు. గ్లాస్కోలాల్చీ పైన, తెల్లటి పైజామా ధరించాడు. విడిగా చూస్తే ఎవరైనా అతన్ని వస్తాదుగా భావించడంలో ఆశ్చర్యం లేదు. పైగా ఖురేషీకి కుస్తీపోటీలంటే మహా యిష్టం. హైదరాబాద్‌లో ఎప్పుడు ఎక్కడ కుస్తీల పోటీలు జరిగినా అతను తప్పకుండా హాజరవుతాడు. పై పందాలు కూడా కాస్తుంటాడు. అసలు కుస్తీ వస్తాదవుదామనే కోర్కె పాతికేళ్లనుంచీ అతనికుండేది. కాని ట్రయినింగు యిచ్చే మేస్త్రీ దొరక్క మానేశాడు. కోసకు ఆ కోర్కె అభిరుచిగా మారిపోయింది.

ఖురేషీ ఇంగ్లీషు పేపరు విప్పి, ఎక్కడైనా కుస్తీ పోటీలున్నాయేమో అడ్వర్టయిజ్‌మెంట్లు చూడసాగాడు.

ఆ ఇరానీ హోటల్లో తొమ్మిది టేబుల్స్, వాటిచుట్టూ ముప్పైఆరు రౌండు కుర్చీలూ వున్నాయి. క్యాష్ టేబుల్‌కు ఎదురుగ్గా నలభై అడుగుల దూరంలో కిచెన్, ఆ కిచెన్ గోడకు తెలుపూ, నలుపూ గ్లేజ్‌డ్ టైల్స్ అమర్చివున్నాయి. మధ్యలో విండో వుంది - లోపల్నుంచి పదార్థాలనూ, టీ కప్పుల్నీ బయటకు అందించడానికి వీలుగా. గోడలకు చుట్టూ బిల్టిన్ దెకలాం కప్‌బోర్డులున్నాయి. వాటిల్లో బిస్కెట్ ప్యాకెట్లూ, సోపులూ, టూత్‌పేస్టులూ, టూత్‌బ్రష్‌లూ, పికిల్స్ సీసాలూ, బోర్నవీటా, టీ, కాఫీ పౌడర్ ప్యాకెట్లూ, కాస్మెటిక్సూ మొదలైనవి వున్నాయి. ఒక కప్‌బోర్డులో క్రోకరీ వుంది. హోటల్లో జనం ఎక్కువమంది లేరు. నాలుగు టేబుల్స్‌ను మాత్రమే ఆక్రమించి వున్నారు. కొంతమంది బన్ మస్కా, మరికొంతమంది బిస్కెట్లూ తింటూ, ఇంకొంతమంది 'ఛాయ్' తాగుతున్నారు.

ఖురేషీకి ఎదురుగ్గా వున్న టేబుల్ దగ్గర కూర్చున్నాడు వాసు. ఉదయం పేపరు తెచ్చినప్పుడల్లా ఆ హోటల్లో వాసు 'ఛాయ్' తాగుతాడు. దానికి ఖురేషీ డబ్బులు పుచ్చుకోడు. అందుకు ప్రత్యేకమైన కారణమేమీ లేదు. ఆ కుర్రవాని మీద ప్రొప్రైటరుకున్న అభిమానామే.

వాసు టేబుల్ దగ్గర కూర్చున్న నిమిషానికే సర్వర్ టీ తెచ్చి ముందు పెట్టాడు. టీ చప్పరిస్తూ వాసు హోటల్‌నంతా కలియజూశాడు. ఒక టేబుల్ ముందు ఇద్దరు రిక్షావాళ్లు కూర్చున్నారు; మరో టేబుల్‌ముందు ముగ్గురు విద్యార్థులు కూర్చుని మిర్చిబజ్జీ తింటున్నారు. ఇంకో టేబుల్‌ముందు పాలవ్యాపారీ, ఆర్.టి.సి. బస్సులో వున్న ఒక డ్రైవరూ మాట్లాడకుండా ఛాయ్ తాగుతున్నారు. ఈశాన్య మూలున్న టేబుల్ దగ్గర ఓ మధ్యవయస్కుడైన వ్యక్తి కూర్చుని సిగరెట్ తాగుతున్నాడు. అయన ముందు ఖాళీ టీకప్పు పెట్టివుంది. నల్లటికోటు ధరించాడు. గడ్డం చేసుకొని ఎన్ని రోజులైందో. తలతోపాటు గడ్డం కూడా మూడొంతులు నెరిసింది. అయన అప్పుడప్పుడూ ఆ హోటల్లో తటస్థపడుతూ వుంటాడు. కాని ఎప్పుడూ వాసు ఆయనతో మాట్లాడలేదు. ఎవరో, ఏం చేస్తుంటాడో వాసుకి ఎరుకలేదు.

ఈశాన్య మూలనున్న టేబుల్ దగ్గరున్నాయన వాసును చేతితో పిల్చాడు, తనదగ్గరకు రమ్మన్నట్టు. తననేనా! అనుకున్నాడు వాసు. కాని తనని కాదేమోనని మళ్లీ తటపటాయించాడు.

ఆయన మళ్లీ వాసును పిల్చాడు చేతి సంజ్ఞతో.

బయట వర్షం తగ్గలేదు.

గబగబా టీ తాగి, ఆయన దగ్గరకు వెళ్లాడు వాసు. పేపర్‌బాయ్ అలా పోవడాన్ని బిల్లు పోగా రూపాయి నోటకుచిల్లరిస్తున్న ఖురేషీ గమనించాడు. ఎందుకో చిన్న దగ్గు దగ్గాడు. ఆ దగ్గును వాసు పట్టించుకోలేదు.

“నీ పేరు వాసు గదూ!” అన్నాడు నల్లకోటులో వున్న వెంట్రుకలు నెరిసిన వ్యక్తి.

'అవును.' అన్నట్టుగా యాంత్రికంగా తల ఆడించాడు వాసు.

"నా పేరేమిటో తెలుసా?" అన్నాడు ఆయన.

తెలియదన్నట్టు తలాడించాడు వాసు అమాయకంగా.

"రాఘవులు. ఒకప్పుడు ఈ హోటల్ వెనుక ఖాళీ ప్రదేశంలో బొగ్గులకొట్టు వుండేది. ఆ కొట్టు వ్యవహారాలు మా ఆవిడ చూసుకొనేది. నేను పైఎత్తున తిరుగుతూండేవాడ్ని. నాకు మూడు రిక్షాలు కూడా వుండేవి. అద్దె కిచ్చేవాడ్ని. ఇప్పుడవన్నీ లేవనుకో!"

రాఘవులు తన కథను ఎందుకు చెబుతున్నాడో వాసుకు అర్థంకాలేదు.

రాఘవులు టేబుల్‌మీదున్న చార్మినార్ పెట్టెలోంచి మరో సిగిరెట్ తీసి వెలిగించాడు. ఆయన ఎదురుగ్గా కుర్చీలో ముళ్ల మీద కూర్చున్నట్టుంది వాసుకి.

"బొగ్గులకొట్టు అమ్మేశాను. రిక్షాలు అమ్మేశాను. ఎందుకో తెలుసా?"

తెలియదన్నట్టు వాసు కోడెదూడలా తల తిప్పాడు.

వాళ్లిద్దరూ మాట్లాడుకొంటూంటే ఖురేషీ అసహనంగా వాళ్లకేసి చూడ సాగాడు.

"నీకు పెళ్లయిందా?" అన్నాడు రాఘవులు.

వాసు తెల్లమొహం వేశాడు- పన్నెండేళ్లకీ పెళ్లేమిటి? అన్నట్టు. అలా అడగడంలో ఆయనకు పిచ్చిలేదుగదా అనుకున్నాడు.

"చేసుకోకు. పెళ్లిచేసుకొని నా బ్రతుకును 'ఖతమ్' చేసుకున్నాను. ఒక వేళ పెళ్లంటూ చేసుకుంటే అందంలేని దాన్ని చేసుకో, సుఖపడతావు. అందమైన ఆడది మొగలిపొదల్లో మిన్నాగులాంటిది. అది నిన్ను, నీ పరువుప్రతిష్టల్ని, నీ జీవితాన్ని కాటేస్తుంది. కట్టుకున్న పెళ్లాంవల్ల కరుణామయుడు కూడా కసాయివాడిలా కఠినంగా మారవలిసి వస్తుంది. నే నట్లాగే మారాను."

నిన్నటి మ్యాటినీ చూసిన హిందీ సినిమాలో కథానాయకుడు గుర్తొచ్చాడు వాసుకి.

"నా పెళ్లాం సుబ్బులు మహా అంద గత్తె. దాని అందానికి అగాధంలోపడి వెయ్యి రూపాయ లెదురిచ్చి దాన్ని పెళ్లాడాను. రేండేళ్లపాటు చక్కగా, వినయంగా, విధేయతగా నాతో కాపురం చేసింది. ఆపైన దాని మెదడులో పురుగు తొలిచింది. బొగ్గుల దుకాణంలో కాటా కూలీని మరిగింది. ఆ తర్వాత ఓ టెయిలర్ దీన్ని నేను వూళ్లో లేనప్పుడు లాడ్జీలకు పట్టుకెళ్లేవాడు. అప్పుడుగానీ నా పెళ్లాం పాతివ్రత్యం తెల్సిరాలేదు. కొట్టాను. తిట్టాను. ఇట్లోంచి బయటకు గెంటాను. మళ్లీ రెండ్రోజులు పోయాక వూరంతా వెతికి నాంపల్లిలో ఓ లాడ్జిలో త్రీస్టార్ హోటల్ సూపర్వ్యయిజర్‌తో కులుకుతూంటే, కొట్టి యింటికి తీసుకొచ్చాను. మరి నా మోజు అలాంటిది. అదింట్లో లేకపోతే, ఇల్లంతా శ్మశానం లాగా వుంటుంది. అది ప్రక్కన పడుకున్నంటే, దాని తప్పులనన్నింటినీ క్షమించేవాడ్ని. తర్వాత కొన్నాళ్లపాటు బుద్ధిగానే వుంది...."

మళ్లీ సిగిరెట్ ముట్టించాడు రాఘవులు.

"నా కథ నీ కెందుకు చెబుతున్నానో నీ కర్థం కాకపోవచ్చు. ఓపిగ్గా విను. ఎందుకంటే, నీ వయస్సులో నేను నీలాగే పేపర్‌బాయ్‌ని. పెళ్లిచేసుకొన్న ఒక ఆడదానివల్ల నీ బ్రతుకు కూడా నాలాగే అధ్వాన్నం, అధోగతి, అప్రదిష్టపాలూ కాగూడదని. తెల్సిందా?"

అప్రయత్నంగా తలాడించాడు వాసు.

"సుబ్బులు మళ్లీ నా కళ్లల్లో కారం కొట్టడం మొదలెట్టింది. అయితే గడప దాటకుండానే అవినీతి భాగోతం సాగించ సాగింది. ఒకరోజు సింగరేణి నుంచి అర్ధరాత్రి ఇంటికొచ్చే సరికి, ఓ ఇరానీ హోటల్ ప్రొప్రైటరు దాని గదిలోంచి బయటికొస్తూ నా కెదురయ్యాడు. వాడు వస్తాదులా వుంటాడు. నేనేం చేసేది? కలబడదామంటే, నన్ను ఎముకల్లో సున్నంలేకుండా ఎత్తి విసిరేయగలడు. చూస్తూచూస్తూ కొండతో ఎట్టా 'ఢీ' కొనేది. కళ్లప్పగించి చూస్తూ నిలబడ్డాను. ఈ అలుసు చూసుకొని వాడు నేను లేనప్పుడల్లా ఇంట్లో జొరబడసాగాడు. ఎంతకాలం సహించేది? నాలో చీమూ, నెత్తురూ నశించాయా? నేను మగవాడ్ని కాదూ? అందుచేత...." చెప్పడం ఆపేసి, "ఛాయ్ తాగుతావా?" అన్నాడు రాఘవులు.

'తాగను' అన్నట్టు తల అడ్డంగా తిప్పాడు వాసు.

"అందుచేత ఏం చేశానంటే—"

ఆదుర్దాగా రాఘవులు మొహంలోకి చూశాడు వాసు.

"ఈ తెల్లవారు ఝామున సుబ్బుల్ని మర్డర్ చేశాను. నేరుగా ఇక్కడికొచ్చి టీ తాగాను. సిగిరెట్లతో కాలక్షేపం చేస్తున్నాను. ఈ పెట్టెలో సిగిరెట్లు అయిపోగానే, పోలీసు స్టేషనుకెళ్లి నేనే చెబుదామనుకుంటున్నాను- నా పెళ్లాన్ని మర్డర్ చేశానని. ఇంకా పెట్టెలో రెండు సిగిరెట్లున్నాయి. వాటిని కూడా తాగేసి..."

గబుక్కున లేచి నిలబడ్డాడు రాఘవులు. ఆయన మొహం గాబరాతో, భయంతో, ఆవేశంతో నిప్పుసెగ తగిలిన సీమపంది తోలులాగైంది.

ఒక సబ్‌ఇనస్పెక్టరూ, ముగ్గురు పోలీసులూ ఆ ఇరానీ హోటల్లోకి వచ్చి ఎవరికోసమో కళ్లతో తీవ్రంగా వెతక సాగారు.

గజగజలాడుతూ ఖురేషీ కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.

రాఘవులు నెమ్మదిగా నడుచుకుంటూ పోలీసు ఇనస్పెక్టరు ముందుకెళ్లి రెండు చేతులూ చాశాడు- బేడీలు వేయమన్నట్టు. ఖురేషీకేసి ఓరగా చూస్తూ గంభీరంగా చిరునవ్వు నవ్వాడు రాఘవులు. ఆ నవ్వులోని ఆంతర్యం అతనికి మాత్రం బోధపడలేదు తెల్లవారేదాకా.

వర్షం సన్నగా పడుతూనే వుంది.

ఆ వర్షంలోనే వాసు హోటల్నుంచి గబగబా బైటకొచ్చి, సైకిలెక్కి రాకెట్ స్పీడులో తొక్కుకుంటూ పోయాడు.